




# పొరపాట్లకు తావివ్వొద్దు

### ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, అక్షిత బ్యూరో :** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని క్యాతన పల్లి మున్సిపాలిటీలోని ..మిగతా 2లో

www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

శనివారం | 18 | జూలై | 2026 | పేజీలు: 08


విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు, వారు ఆరోగ్యంగా ఉండేలా వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.



# విద్యతోనే ఉజ్వల భవిత

### పరిశుభ్రతతోనే ఆరోగ్యం: కలెక్టర్ చంద్ర శేఖర్



**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** విద్యార్థులకు మంచి విద్యను అందించడంతో పాటు, వారు ఆరోగ్యంగా ఉండేలా వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం అయన నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో సివిల్ పనులు జరుగుతుండగా అన్నింటి పై ఆరా తీశారు. నీటి సంపు ,సెప్టిక్ ట్యాంకు, అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు ..మిగతా 2లో



# చిన్నారులకు పౌష్టికాహారం

### పటిష్టంగా మెనూ

### కౌకుంట్ల మండలంలో ఆకస్మిక తనిఖీలు

### కలెక్టర్ కుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** పుట్టపల్లి, పేరూరు గ్రామాల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జడ్ పి పాఠశాల అంగన్వాడీ కేంద్రం లు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్య శాల తనిఖీ పేరూరు అంగన్వాడీ 3 కేంద్రంలో మెనూ పాటించకపోవడం,పరిశుభ్రత లేకపోవడం తో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అంగన్వాడీ టీచర్, ఆయాలకు షోకాజ్ నోటీస్ జారీ కౌకుంట్ల మండలంలోని పుట్టపల్లి, పేరూరు గ్రామాలలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్య కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా పుట్టపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. బోర్డుపై రాసిన అక్షరాలను విద్యార్థులతో చదివించి ..మిగతా 2లో





# దశ దిశలా అల్ఫోర్స్ ఖ్యాతి

### 'అల్ఫోర్స్'లో స్ఫూర్తి కిరణాలు

### నీట్ -2026 ఫలితాలలో "అల్ఫోర్స్" చారిత్రాత్మక విజయం

**కరీంనగర్, అక్షిత బ్యూరో :** నీట్-2026 ఫలితాలలో పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుందని మా అల్ఫోర్స్ విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యద్భుత మార్కులు సాధించి నిరూపించారు. డి.రిత్విక్ 647 మార్కులతో అత్యున్నత స్థానంలో నిలువగా, సిద్దాంత్ చతుర్వేది 564, సయ్యద్ మలాజుద్దీన్ 557, వసుల శ్రుత్విక 551, ..మిగతా 2లో





### సంరక్షణకు సమగ్ర

# చర్యలు చేపట్టాలి

### నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలి

### నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి

### నేల స్వభావానికి అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, అక్షిత బ్యూరో :** జిల్లాలో భూగర్భ జలాల పెంపు, సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, ఉద్యానవన పంటల సాగుపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి ..మిగతా 2లో

## దశ దిశలా అల్ఫోర్స్ ఖ్యాతి

**మొదటి పేజీ తరువాయి...**

గులామ్ మహమ్మద్ హుస్సేన్ 548, బత్తుల అభిజ్ఞ 541, లింగంపల్లి అనంత్ సాయి 540, నార్ల శ్రీహిత 538, శ్రేయాంశ్ ద్వివేది 537, కొండ్ల అక్షిత 522, బొమ్మవరపు రుత్విక్ 515, జక్కుల శ్రీవైత్రి 512, టి.హర్షిత 509, సిద్దం సాత్విక 508, ఎ.సత్య బ్రాహ్మిణి 507, బి. అక్షర 505, నిద 502, గుంజేటి రిషిత 501, జహ్రా మాజీద్ 501 మార్కులు సాధించి అల్ఫోర్స్ ఖ్యాతిని పెంచారు. నీట్ కోచింగ్ డాక్టర్లు-30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్ ను అందించడం ద్వారా అల్ఫోర్స్ విజయ పరంపర కొనసాగుతుంది. 19 మంది విద్యార్థులు 500 మరియు ఆపై మార్కులు సాధించడము విశేషం. సుమారుగా 100 మంది విద్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలలలో సీట్లు సాధించగలరని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. పటిష్ట ప్రణాళికతో విద్యాబోదన, నిరంతర పర్యవేక్షణ మరియు విద్యార్థుల అకుంటిత దీక్ష, పట్టుదల మరియు కృషి వల్ల ఇంతటి ఘన విజయం సాధించడం జరిగింది. తక్కువ మంది విద్యార్థులతో అధికముగా సీట్లు సాధించడం అల్ఫోర్స్ విజయాలకు నిదర్శనం.

నీట్ అయిన ఐఐటి అయిన విద్యార్థులను విజయ మార్గంలో నడిపిస్తున్న సంస్థ అల్ఫోర్స్. ఇంతవరకు ప్రకటించబడిన అన్ని ఫలితాలలో అల్ఫోర్స్ ముందంజలో ఉండడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రములో విద్యాభివృద్ధికై కృషి చేస్తున్న అల్ఫోర్స్ ను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తూ తమ పిల్లలను అల్ఫోర్స్ లో చేర్పిస్తున్నందుకు వారికి మన. స్ఫూర్తిగా కృతజ్ఞతాభినందనలు తెలియజేయుచున్నాను.రాబోయే కాలములో అత్యధిక మంది విద్యార్థులను మెడికల్, ఐఐటి మరియు ఎన్.ఐ.టిలలో సీట్లు సాధించే విధముగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భముగా తెలియజేయుచున్నానుర్యాంకులు సాధించిన మా అల్ఫోర్స్ అణీముత్యాలను అభినందిస్తూన్నాను. మరియు ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేశారు

## చిన్నారులకు పౌష్టికాహారం

**మొదటి పేజీ తరువాయి...**

వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, గైర్హాజరు వివరాలు తెలుసుకోవడంతో పాటు ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు.

తదుపరి పుట్టపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రానికి హాజరవుతున్న గర్భిణుల సంఖ్య, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం పేరూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ల్యాబ్ సిబ్బంది వివరాలు, రోజువారీ పరీక్షల సంఖ్య, సిబ్బంది ఎంతమంది ఉన్నారు అనే విషయాలను వైద్య అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ గర్భిణితో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు.

అనంతరం పేరూరులోని పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసి పశువులకు అవసరమైన మందులు, టీకాలు అందిస్తున్నారా లేదా పరిశీలించారు. పశు వైద్య కేంద్రం కేంద్రం సమీపంలోని మురుగు కాలువ అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే కాలువను శుభ్రం చేసి ఫొటోలు పంపించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

పేరూరు అంగన్‌వాడీ 3 కేంద్రంలో తనిఖీ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం ఆహారం అందించకుండా కేవలం అన్నం, నీళ్ల చారు మాత్రమే ఇవ్వడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. అలాగే కేంద్రంలో పరిశుభ్రత లోపాలను గుర్తించి సంబంధిత అంగన్‌వాడీ టీచర్, ఆయాపై విధుల పట్ల నిర్లక్ష్య వైఖరికి షోకాజ్ నోటీసులు జారీకి ఆదేశించడంతో జిల్లా సంక్షేమ అధికారి షోకాజ్ నోటీస్ లు జారీ చేశారు చివరిగా పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సమీపంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, మండల అధికారులు ఉన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిత

**మొదటి పేజీ తరువాయి...**



మట్టి దిబ్బలు, చెత్త కుప్పలు, కంకర సిమెంట్, ఇసుక ,కర్రలు ఇనుప చువ్వలు ఉండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ తక్షణమే డోజర్ ఏర్పాటు చేసి పాఠశాల ఆవరణ మొత్తం శుభ్రంగా చేయించాలని, ఎక్కడపడితే అక్కడ సిమెంటు, కర్రలు వంటివి వేయకూడదని,చెత్త చెదారం వల్ల పాములు, తెల్ల వంటివి పాఠశాలలో సంచరించ కుండా చూడాలని, బాత్రూముల తో పాటు అన్ని శుభ్రంగా ఉంచాలని, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ప్రవల్లికను, ఎంపీడీవో రజితను, గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం సరిగాలేదని, ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు .తక్షణమే గ్రామంలోని అన్ని మురికి కాలువలను శుభ్రం చేయించడమే కాకుండా, కేజీబీవీ, ప్రాథమిక పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించాలని ,పారిశుధ్య లోపం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినిలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రభుత్వం సరఫరా చేసిన పాఠశాల యూనిఫామ్ కొలతలు సరిగా లేనందువల్ల ఎక్కువ మంది విద్యార్థినిలు వాటిని ధరించడం లేదని తెలుసుకొని తక్షణమే ఏపీఎంను అక్కడికి పిలిపించి యూనిఫాం సరఫరా చేసిన టైలర్ ను పాఠశాలలోనే రెండు, మూడు రోజులు ఉంచి విద్యార్థినిల కొలతలు తీసుకొని అక్కడికక్కడే యూనిఫామ్ కుట్టించి ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్ ను తనిఖీ చేసి విద్యార్థులు కంప్యూటర్లను ఉపయోగిస్తున్నది లేనిది కంప్యూటర్ల ద్వారా విద్య అందిస్తున్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. టెక్స్ట్ బుక్కులు, నోటుబుక్కులు వచ్చాయా? అని విద్యార్థినిలను ప్రశ్నించారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్ వద్దిపాముల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. కాగా ఇక్కడ విద్యార్థులు భోజనం చేస్తుండగా వారితో మాట్లాడు తూ యూనిఫామ్, భోజనం, నోట్ బుక్కులు, పుస్తకాలు, కిట్స్ గురించి అడిగారు. ఎలాంటి సబ్జెక్టులు నేర్చుకున్నారని? బాగా చదువుకోవాలని తెలిపారు. కాగా విద్యార్థులు అన్నం వృధా చేస్తుండగా వారికి అన్నం విలువ తెలిసే విధంగా చూడాలని హెడ్మాస్టర్ ను ఆదేశించారు.

నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ సురేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, ఇన్చార్జ్ ఎంపిడిఓ రజిత, తదితరులు ఉన్నారు.

# పొరపాట్లకు తావివ్వొద్దు



**మొదటి పేజీ తరువాయి...**

4వ వార్డులో మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి, మందమర్రి మున్సిపాలిటీలోని 19వ వార్డులో మండల తహసిల్దార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజ్ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం ఆగస్టు 3వ వరకు పొడిగించిందని, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు అందించిన ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు అధికారులకు సహకరించాలని తెలిపారు. నింపిన ఫారాలలోని వివరాలను బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు బి.ఎల్.ఓ. యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని, అర్హత గల ఓటర్లు స్వయంగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చేపట్టాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగు నీటిని అందించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించాలని, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియట్ కు ఆధునికరించడం జరిగిందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంరక్షణకు సమగ్ర చర్యలు చేపట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**



వివిధ అంశాలపై చిత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాల పెంపు, సంరక్షణ కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తక్షణమే క్షేత్రస్థాయిలో అవసరమైన పనులను చేపట్టాలని ఆదేశించారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వీబీజీ రామ్ జీ పథకంలో భాగంగా గ్రామీణ పేదలకు సంవత్సరంలో 125 రోజుల పాటు తప్పనిసరిగా ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించడంతో పాటు, శాశ్వత ఆదాయ వనరులను సృష్టించే ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

భూగర్భ జలాల పెంపు కోసం మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన పంటల సాగు కోసం నిర్దేశించిన 2,400 ఎకరాల లక్ష్యాన్ని సాధించేందుకు అనుసూచిత కులాలు, అనుసూచిత తెగలు, మహిళలు, సన్నకారు, చిన్నకారు రైతులను ప్రాధాన్యతగా ఎంపిక చేయాలని సూచించారు.

జిల్లాలో మామిడి, జామ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, మునగ, ఆయిల్‌పామ్ తదితర ఉద్యానవన పంటల సాగును రైతులు చేపట్టేలా ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు.

నర్సరీలలో మొక్కల నాణ్యతను వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కల పంపిణీ అనంతరం బిందు సేద్య వ్యవస్థల ఏర్పాటుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. నర్సరీలలో నాటిన మొక్కల్లో కనీసం 75 శాతం జీవించి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా కార్యాచరణ ప్రణాళిక, 2026 ఆర్థిక సంవత్సర లక్ష్యాల్లో భాగంగా పంటల వైవిధ్యీకరణ, ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వీబీ-జీ రామ్ జీ చట్టం, 2025 కింద నీటి సంరక్షణ పనుల్లో భాగంగా వ్యవసాయ క్షేత్రాల చెరువులు, అనుబంధ నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు.పంటల వైవిధ్యీకరణ, భూగర్భ జలాల పరిరక్షణపై గ్రామ సభల ద్వారా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నీటి భద్రతను పెంపొందించేందుకు వ్యవసాయ క్షేత్రాల చెరువులు, వ్యక్తిగత వ్యవసాయ క్షేత్రాల చెరువులు, బోరుబావుల పునర్భరణ గుంతలు, వర్మీ కంపోస్టు యూనిట్లు, నీటి చౌరబాటు చెరువుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# గిరిజన విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

## విద్య, వసతి, భద్రతపై రాజీ లేదు

### ఏకలవ్య గురుకుల పాఠశాలలో కలెక్టర్ సమగ్ర తనిఖీ



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మిక తనిఖీ, శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని వెల్దండ మండలం గుండాల గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను పరిశీలించారు.

మొదట భోజనశాల, డైనింగ్ హాల్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. వంటశాలలో ఆహార పదార్థాల నిల్వ, తాగునీటి వినియోగం, వంట ప్రక్రియలను తనిఖీ చేసి నాణ్యమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

అనంతరం విద్యార్థుల డార్మిటరీలను పరిశీలించిన ఆయన పడకల ఏర్పాటు, గదుల పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి వసతి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించిన కలెక్టర్, ఉపాధ్యాయుల బోధనా



విధానాలు, డిజిటల్ లెర్నింగ్ వినియోగం, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారు ఏ గ్రామాలు, ఏ మండలాల నుంచి వచ్చారో అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గిరిజన గ్రామాలకు చెందినవారని తెలిపారు.

విద్యార్థులకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచనా వేసిన కలెక్టర్, సీబీఎస్‌ఈ సిలబస్‌కు అనుగుణంగా బోధన సమర్థవంతంగా కొనసాగాలని సూచించారు. భావనాత్మక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పోటీ పరీక్షలకు అవసరమైన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ఆత్మవిశ్వాసం పెంపొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన పాఠశాల సమీపంలోని గుట్ట ప్రాంతాన్ని తొలగించి ప్రాంగణంలోనే బోరు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన బోరు తవ్వకాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, క్రీడా సామగ్రి, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ వినియోగం వంటి అంశాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ,...... గిరిజన విద్యార్థులకు అత్యున్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏకలవ్య గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోందని అన్నారు. ఈ విద్యాసంస్థల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు పెంపొందించుకునేలా గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు.

చిన్నచిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఆహారం వంటి ప్రాథమిక అవసరాల విషయంలో ఎలాంటి లోపాలు ఉండరాదని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని అధికారులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి,వెల్దండ తహశీల్దార్ కార్తిక్ కుమార్, యంఈఓ చంద్రుడు నాయక్, పాఠశాల ప్రిన్సిపల్,వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు

# బీసీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

### బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల అశోక్



**వలిగొండ/ అక్షిత న్యూస్:** వలిగొండ మండల కేంద్రంలో బీసీ హక్కుల సాధన సమితి సమావేశం చొప్పరి వెంకటేశం అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల అశోక్ మాట్లాడుతూ బీసీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి దగ్గర ఉన్నందున వారు దీనిపై తక్షణమే చొరవ చూపి నిధులు విడుదల చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జనగణలో భాగంగా కులగనన కూడా చేయాలని డిమాండ్ చేశారు. దీనితో భారతదేశవ్యాప్తంగా ఏ కులం వారు ఎంత జనాభా ఉన్నారో తెలుస్తుందని జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో నిధులు కేటాయించి బీసీలను అభివృద్ధి పరచడం లో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. మేమెంతో మాకంత వాటా కావాలని ఆయన సమావేశంలో అన్నారు.

సమావేశం అనంతరం కన్వినింగ్ కమిటీని ఎన్నిక చేసినారు కన్వీనర్ గా ఓర్సు స్వామి, కో కన్వీనర్లుగా చొప్పరి వెంకటేశం, భీమ గాని శ్రీను తదితరులను ఎన్నిక చేయడం జరిగినది.ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు కన్నబోయిన రాములు, మచ్చ లక్ష్మీనారాయణ, బొడిగె సుదర్శన్, కొయ్యగుర రాంమల్లు , కన్నెబోయిన పృథ్వి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

### ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

### కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, చిగురుమామిడి మండల కేంద్రం, ముల్కనూరు గ్రామాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఫోర్‌లైన్ రహదారికి సంబంధించిన భూసర్వే, అలైన్‌మెంట్ పనులను పరిశీలించారు. ఫేజ్–1 కింద కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎక్కడైనా నివాస గృహాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందా, ప్రత్యామ్నాయంగా బైపాస్ మార్గాల ఏర్పాటు సాధ్యమా అనే అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే గ్రామసభలు నిర్వహించి స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు చేపట్టాలని, భూసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులు చేపడుతూనే ప్రజల ఇళ్లకు, జీవన విధానానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, తిమ్మాపూర్, చిగురుమామిడి తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, ఆర్ అండ్ బి డీఈ కిరణ్, ఏఈ సురేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డా,లకవత్ లక్ష్మీనారాయణ దంపతులకు సన్మానం



**వరంగల్, అక్షిత బ్యూరో:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, పాలకమండలి సభ్యులుగా నియామకం పొంది వరంగల్ నగరానికి విచ్చేసిన డాక్టర్ లాకావత్ లక్ష్మీ నారాయణ,వారి సతీమణి ఉమ్మడి వరంగల్ మాజీ జడ్పీ చైర్మన్ లాకావత్ ధన్వంతి దంపతులను 19వ డివిజన్ వరంగల్ లోని వెంకట రామ జంక్షన్ వద్ద మాజీ మంత్రి,ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఘనంగా సన్మానించినారు.

ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు నల్లగొండ రమేష్,మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్,బస్వరాజు శిరీష-శ్రీమాన్,తత్తరి లక్ష్మణ్,ధూపం సంపత్,జన్ను రవి, కురతోట సదానందం, గోరంటల రాజు, కొరివి పరమేష్,సలీం, చాగంటి శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరాటే ప్రభాకర్, రాముల బాబు,నారగోని మురళి,కూచన ఏకాంబరం,చిరంజీవి, క్యాతం వేణు వెల్దండి లక్ష్మణ్, నరిగే శ్రీనివాస్, నీలం మధు, బాదావత్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# స్కానింగ్ కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని అవాస్తవం

## సివిల్ ఆసుపత్రి సూపరిండెంట్ వీరారెడ్డి



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ సివిల్ ఆస్పత్రిలో స్కానింగ్ కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని కొందరు వార్తలను ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా వైరల్ చేస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. సీటీ స్కాన్ కోసం రూ.500, ఎం.ఆర్.ఐ స్కానింగ్ కోసం రూ.2500 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం, వైద్య పరీక్షలు ఉచితం కాదా అంటూ ప్రచారం సాగుతోంది

కరీంనగర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సీటీ స్కాన్ మాత్రమే ఉంది. ఎం.ఆర్.ఐ స్కానింగ్ సౌకర్యం లేదు. లేని ఎం.ఆర్.ఐ సేవలకు డబ్బులు ఎలా వసూలు చేస్తారు?


వాస్తవానికి గుల్ల కోట గ్రామానికి చెందిన గుజ్జేటి తిరుపతి అనే పేషెంట్ ఆస్పత్రి సూపరిండెంట్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావడం జరిగింది. ఆయన ఆధార్ కార్డుతో ఓపీ ఎంట్రీ చేయించుకున్నారు. అయితే సీటీ స్కాన్ చేసే సమయంలో ఆరోగ్య శ్రీ కార్డు కానీ, రేషన్ కార్డు కాని చూపించనందు వల్ల స్కానింగ్‌కు రూ.500 అవుతుందని సిబ్బంది చెప్పడం జరిగింది. ఈ ఛార్జీల వసూలు కొత్తగా ఉన్నదేమీ కాదు. గత కొన్ని సంవత్సరాలుగా అమల్లో ఉన్న విషయాన్ని ఆయన దృష్టికి తేవడం జరిగింది.

ఆస్పత్రిలో ఇన్‌పేషంట్ కానీ, ఔట్ పేషంట్ కానీ వారి యొక్క తెల్ల రేషన్ కార్డు లేదా, ఆరోగ్య శ్రీ కార్డు చూపిస్తే సీటీస్కాన్ సేవలు ఉచితంగానే అందించడం జరుగుతుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో తెల్ల రేషన్ కార్డు దారులకు, ఆరోగ్య శ్రీ కార్డు దారులకు ఉచితంగానే సేవలు అందుతాయి. అనవసర ప్రచారాలను నమ్మవద్దు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మా దృష్టికి తేవాలని తెలిపారు

# ఎన్యూమరేషన్ ఫారం లను గడువులోగా ఆన్లైన్ చేయాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ఎన్యూమరేషన్ ఫారం లను గడువులోగా ఆన్లైన్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి స్థానిక అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బిఎల్‌ఓ లు, సూపర్వైజర్లు తహసిల్దార్ల తో సర్ ప్రక్రియ ఆన్లైన్ పై వెబెక్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు ఇట్టి సమీక్ష సమావేశంలో శనివారం అందరూ పోలింగ్ స్టేషన్ వారిగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఇట్టి సమావేశానికి బిఎల్‌ఏ లు అందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. ఈనెల 22వ తేదీ లోపు ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్ ఓటర్ల తుది లిస్టులను తయారుచేసి బిఎల్‌ఓ సూపర్వైజర్లకు సమర్పించాలని ఆదేశించారు ఎన్యూమరేషన్ ఫారంలను గడువు తేదీలోగా 100% ఆన్లైన్ చేయాలని ఆదేశించారు.

# పుష్కరాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి పుష్కర ఘాట్లను పరిశీలించిన కలెక్టర్ రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం సోన్ మండలంలోని పుష్కర ఘాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్ల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.



పుష్కరాల నాటికి ఘాట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. గత పుష్కరాల్లో నమోదైన భక్తుల రద్దీ వివరాలను తెలుసుకొని, ఈసారి అంచనా మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. చేపట్టే అన్ని పనులు నాణ్యతతో, మన్నికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పుష్కర ఘాట్లకు చేరుకునే మార్గాల్లో స్పష్టమైన సూచికల బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, తగిన పార్కింగ్ సౌకర్యాలు, రాకపోకలకు అనువైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. భక్తుల భద్రత, పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, లైటింగ్ తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

ఈ పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ అనిల్, తహసీల్దార్ సంతోష్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

## దోమల నివారణకు ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజు డ్రై డే తప్పనిసరిగా పాటించాలి

## విద్యార్థులు అవగాహన కల్పించాలి, జిల్లా కలెక్టర్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న సావిత్రిబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంతో పాటు కాలనీలోని పలువురి ఇండ్ల ముందర నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మున్సిపల్ చైర్‌పర్సన్ భృంగి రత్నమాలతో కలిసి పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు ప్రతి శుక్రవారం చేపట్టే చేపట్టిన కార్యక్రమంలో వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., వర్షాకాలంలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ప్రజలందరూ బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇళ్లలో, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, వ్యాపార సంస్థల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. కూలర్లు, నీటి ట్యాంకులు, డ్రమ్‌లు, బకెట్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఉపయోగం లేని పాత్రలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా వారానికి కనీసం ఒకసారి పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు. దోమలు నిల్వ నీటిలోనే ఎక్కువగా వృద్ధి చెందుతాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ప్రజల సహకారంతోనే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులను పూర్తిగా నియంత్రించడం సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి కుటుంబం "ప్రతి శుక్రవారం డ్రై డే" అనే భావనను అలవాటు చేసుకుని, తమ ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు

ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ అహ్మద్, కల్వకుర్తి తహహసిల్దార్ ఇబ్రహీం, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# హెల్మెట్ వాడకంతో ప్రాణరక్షణ...

## ట్రినిటీ పాఠశాలలో రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన...

## చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ద్విచక్ర వాహనదారులు ప్రాణాపాయం నుంచి బయటపడాలంటే హెల్మెట్ ధరించడం ఒకటే మార్గమని చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని ట్రినిటీ హైస్కూల్లో విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేశం హాజరై మాట్లాడుతూ... విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన గురించి ట్రాఫిక్ రూల్స్ వివరించారు. విద్యార్థులు వివిధ ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి ఇంట్లో పెద్దవారికి ఈ విషయాలు చెప్పాలని అన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడపవద్దని సూచించారు. అలాగే వాహనాలను నడిపేటప్పుడు మొబైల్స్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్ సిగ్నల్ ఉన్నప్పుడు రోడ్డు దాటలని,త్రిపుల్ రైడింగ్ చేయవద్దన్నారు. బండి నడుపునప్పుడు ఇండికేటర్స్ తప్పకుండా వాడవలనని, అలాగే నో పార్కింగ్ వద్ద వెహికల్ ని పార్కింగ్ చేయవద్దని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ వివరించారు. అలాగే విద్యార్థుల చేత తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ హై స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, ట్రాఫిక్ ఎస్ఐ జి సైదిరెడ్డి,ఆర్ ఎస్ ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ జంగయ్య, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫ్లోరోసెన్స్ గైడెడ్ రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు




**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సర్జికల్ ఆంకాలజీ ఆంకాలజీ రోబోటిక్ సైన్సెస్ డాక్టర్ చిన బాబు మాట్లాడారు.క్యాన్సర్ నిర్ధారణ చికిత్స రంగంలో సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిందని క్యాన్సర్ నయం చేయడమే కాదు రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధునిక శస్త్రచికిత్సల లక్ష్యం అని ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తిగా నయం చేస్తుందని అన్నారు . అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో రోబోటిక్ శస్త్రచికిత్స మరియు ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ ఒకటి.ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం తక్కువ టిష్యూ డ్యామేజ్ తక్కువ రక్తనష్టం వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయి.హై–డెఫినిషన్ 3డి విజన్ ట్రెమర్ – ఫ్రీ ఇన్‌స్ట్రుమెంట్స్ మరియు మనిషి చేతి కదలికలను అనుకరించే రైస్తెద్ ఇన్స్ట్రుమెంట్స్ ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చు. సాధారణంగా చెప్పాలంటే పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎంఎం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పనిచేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారు.దీని వలన రోగికి తక్కువ నొప్పి చిన్న మచ్చలు తక్కువ రక్తనష్టం కలుగుతుంది.ఇంకా స్మార్ట్ టెక్నాలజీ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా సురక్షితంగా మారుతున్నాయి. మహిళల క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ ముఖ్యంగా గర్భాశయ మరియు అండాశయ క్యాన్సర్లలో రోబోటిక్ శస్త్రచికిత్స గొప్ప ఫలితాలను ఇస్తోంది. రడీకల్ హైస్టెరెక్టమీ లింఫ్ నోడ్ డిస్సెక్షన్ వంటి క్లిష్టమైన ఆపరేషన్లు సురక్షితంగా చేయవచ్చు.గతంలో 4--5 రోజుల ఆసుపత్రి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు చాలామంది రోగులను 24 గంటల్లోనే డిశ్చార్జ్ చేయవచ్చు. రొమ్ము క్యాన్సర్‌లో ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కూడా ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీ కొత్త దిశను చూపుతోంది. ప్రత్యేకమైన డై ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత క్యాన్సర్ నుండి మొదట ప్రభావితమయ్యే సెంటినెల్ లింఫ్ నోడ్స్ (సెంటినల్ లింఫ్ నోడ్స్ ) ప్రత్యేక కెమెరా ద్వారా స్పష్టంగా కనిపిస్తాయి. దీని వలన అవసరమైన లింఫ్ నోడ్స్‌ను మాత్రమే ఖచ్చితంగా తొలగించవచ్చు. గతంలో లాగే అన్ని లింఫ్ నోడ్స్ తొలగించాల్సిన అవసరం తగ్గి చేతి వాపు (లైఎంపీహెడేమా ) నొప్పి మరియు ఇతర సమస్యలు గణనీయంగా తగ్గుతాయి.ఇది రోగి జీవన నాణ్యతను మరింత మెరుగుపరుస్తుంది. యూరాలజీ క్యాన్సర్లలో సరికొత్త మార్పులు ప్రోస్టేట్ బ్లాడర్ కిడ్నీ మరియు అడ్రినల్ ట్యూమర్ల చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చింది. ప్రోస్టేట్ బ్లాడర్ క్యాన్సర్లలో పెల్విక్ ప్రాంతం చాలా ఇరుకుగా ఉండటం వల్ల ఓపెన్ సర్జరీ క్లిష్టంగా ఉండేది. ఇప్పుడు రోబోటిక్ సర్జరీ ద్వారా మెరుగైన నేర్వ్ ప్రెజర్వేషన్ సాధ్యమై ఉరినరీ కంటినయన్స్ సెక్సువల్ ఫంక్షన్ మెరుగ్గా కాపాడవచ్చు. కిడ్నీ క్యాన్సర్లలో రోబోటిక్ సర్జరీ వలన పార్టీయల్ నీఫరెక్టమీ ఎక్కువగా చేయగలుగుతున్నాం. అంటే కేవలం ట్యూమర్ ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి మిగిలిన ఆరోగ్యకరమైన కిడ్నీని కాపాడటం సాధ్యమవుతోంది.దీని వలన పూర్తి కిడ్నీ తొలగించాల్సిన అవసరం తగ్గి క్యాన్సర్ నియంత్రణలో ఎలాంటి రాజీ లేకుండా మంచి ఫలితాలు సాధించవచ్చు.అడ్రినల్ ట్యూమర్లలో కూడా తక్కువ రక్తనష్టం చిన్న గాయాలు వేగవంతమైన కోలుకోవడం వంటి ప్రయోజనాలతో సురక్షితంగా శస్త్రచికిత్సలు చేయవచ్చు.కోలోరెక్టల్ క్యాన్సర్లలో ఖచ్చితత్వం క్యాన్సర్లలో ఈ టెక్నాలజీ పెద్ద మార్పు తీసుకొచ్చింది. ట్యూమర్‌ను ఖచ్చితంగా గుర్తించి తొలగించడం వల్ల చాలాసార్లు పెర్మనెంట్ కలస్టమీ అవసరం లేకుండా చేయగలుగుతున్నాం. స్మార్ట్ స్థాప్లర్ ఫైర్ టెక్నాలజీ ద్వారా బావల్ ఇండ్స్ ను మరింత సురక్షితంగా కలపవచ్చు.లీకేజీ ప్రమాదం తగ్గి మెరుగైన నేర్వ్ ప్రెజర్వేషన్ వలన ఉరినరీ సెక్సువల్ క్వాలిటీ అఫ్ లైఫ్ కూడా బాగుంటుంది. ఛాతి క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో కొత్త యుగం ఛాతి శస్త్రచికిత్సలలో కూడా ఇప్పుడు పెద్ద కోతలు వేసే రోజులు పోయాయి. గతంలో లాంగ్ సర్జరీస్ కోసం చెస్ట్ ఓపెన్ చేసి 7--10 రోజుల హాస్పిటల్ స్టే ఉండేది.ఇప్పుడు 8 ఎంఎం చిన్న పోర్ట్స్ ద్వారానే సురక్షితంగా లాంగ్ సర్జరీస్ చేయవచ్చు.ఫఫ్లయ్ టెక్నాలజీ -- క్యాన్సర్‌ను వెలుగులో చూపించే సాంకేతికత ఫఫ్లయ్ ఫ్లూరెససెన్స్ ఇమగెంగ్ అనేది మరో అద్భుతమైన టెక్నాలజీ ప్రత్యేక డై ఇంజెక్షన్ తర్వాత క్యాన్సర్ టిష్యూలు లేదా లింఫాటిక్ మార్గాలు గ్లో అవ్వడం ద్వారా వాటిని మరింత స్పష్టంగా గుర్తించవచ్చు. సెంటినల్ లింఫ్ నోడ్ మాపింగ్ కూడా మరింత ఖచ్చితంగా చేయగలుగుతున్నాం. రోగులకు కలిగే ప్రధాన ప్రయోజనాలు తక్కువ నొప్పి తక్కువ రక్తనష్టం తక్కువ ఆసుపత్రి రోజులు త్వరగా పనికి తిరిగి వెళ్లే అవకాశం మెరుగైన జీవన నాణ్యత తక్కువ మచ్చలు కుటుంబ భావోద్వేగ మరియు ఆర్థిక ఒత్తిడి తగ్గడం.ఈ విధంగా రోబోటిక్ మరియు ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీలు క్యాన్సర్ శస్త్రచికిత్సలను కేవలం వ్యాధి నివారణకే పరిమితం చేయకుండా రోగి జీవన నాణ్యతను కాపాడే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయి.ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ మార్కెటింగ్ మేనేజర్ శ్రీకాంత్ దూడ ఖమ్మం మార్కెటింగ్ మేనేజర్ బాలరాజు పాల్గొన్నారు.

## రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణనను మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు..

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, శేరిలింగంపల్లి వడ్డెర సంఘం అధ్యక్షుడు ముద్దంగుల తిరుపతి ఆధ్వర్యంలో సన్మానం..



**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన గుంజ రేణుక నారాయణకి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రెటరీ శేరిలింగంపల్లి వడ్డెర సంఘం అధ్యక్షులు ముద్దంగుల తిరుపతి అద్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి ఆమెకు పూల బోకెను అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర వడ్డెర కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గా గుంజ రేణుక నారాయణ ని నియమించిన సందర్భంగా వారిని వారి నివాసం లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.వడ్డెర సంఘం కార్పొరేషన్ చైర్మన్ గా గుంజ రేణుక నారాయణ ని నియమించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి మరియు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలుతెలియజేసినారు.

గుంజ రేణుక నారాయణ కి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేసిన ఈ కార్యక్రమంలో అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ మంజలేకర్, శ్రామిక శక్తి అవార్డు గ్రహీత తెలంగాణ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి, టిపిసిసి లేబర్ సెల్ వైస్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి,టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరమల్ల వీరేందర్ గౌడ్ శ్రమశక్తి అవార్డు గ్రహీత టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఏ బ్లాక్ మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఉయ్యూరు శ్రీదేవి,శేరిలింగంపల్లి నియోజకవర్గం టిపిసిసి లేబర్ సెల్ అధ్యక్షులు మాదిరెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తమ్మలి మాణిక్యం, బ్రహ్మానందం నాగరాజు, ఉయ్యూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సర్ పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలి

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 58, 59, 60 డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలతో సమీక్షా సమావేశాన్ని శ్రీనగర్ కాలనీ పాపులర్ గార్డెన్స్ నందు శుక్రవారం రోజున నిర్వహించారు. ముఖ్య అతిథిగా దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీ వరకు పొడగించిందని, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఎల్ఏలకు సూచించారు. సర్ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియమించిన బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేస్తున్నారని అన్నారు. పలువురు ఓటర్లు ఎన్యూమరేషన్ ఫామ్స్ పూర్తి చేయడంలో ఇబ్బందులు పడుతున్నారని వారికి సాయంగా గులాబీ శ్రేణులు పని చేయాలని కోరారు. ఓటర్ ఎన్యూమరేషన్ ఫామ్స్ తీసుకున్న ఓటర్లు సంబంధిత బీఎల్వోలకు వివరాలు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫామ్స్ తిరిగి ఇచ్చేలా బాధ్యత తీసుకోవాలని అన్నారు. రెండు చోట్ల ఓట్లు ఉన్నవారి, చనిపోయిన వారి ఓట్ల సమాచారాన్ని బీఎల్వోలకు అందించాలని సూచించారు. తప్పులు, అవకతకలు లేని ఓటర్ లిస్ట్ తయారీలో కీలకంగా మారే సర్ ప్రక్రియలో బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, డివిజన్ల వారీగా ఇప్పటికే పార్టీ తరపున హెల్ప్ లైన్ సెంటర్లను ఏర్పాటు చేసిన నాయకులను అభినందించారు. పార్టీ కార్యాలయం కేంద్రంగా సర్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు, సమాచారం అవసరం ఉన్నా సమన్వయం చేసుకొని పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో 58, 59, 60 డివిజన్ల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించిన విద్యార్థినికి ఆర్థిక చేయూత



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధికి చెందిన నాగోజు శివాని, సురేందర్ చారి దంపతుల కుమార్తె హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్ (ఎంపిహెచ్) కోర్సులో సీటు సాధించిన సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ పాపి శెట్టి రామన్న ఆర్థిక సహాయం అందజేశారు. కార్పెంటర్‌గా పనిచేస్తున్న సురేందర్ చారి కుటుంబానికి ఉన్నత విద్యాభ్యాసంలో అండగా నిలుస్తూ ఈ సహాయాన్ని అందించిన రామన్నను కుటుంబ సభ్యులు కృతజ్ఞతలతో అభినందించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదని, విద్యార్థులకు చేయూత అందించడం సమాజ బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, శిరమోని రమేష్ యాదవ్ తదితరులు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

People's voice అక్షిత
AKSHITHA NATIONAL DAILY


## సన్నూరులో ఉచిత ఆరోగ్య శిబిరం



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** మండలంలోని సన్నూరు గ్రామంలో లుమినస్ హాస్పిటల్ వారి సహకారంతో బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్నూరు గ్రామంలో శుక్రవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 120 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి చినపాక రజిత రాంబాబు మాట్లాడుతూ, గ్రామస్తులు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే వివిధ రకాల క్యాన్సర్‌ల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో డాక్టర్ సంధ్యారాణి నేతృత్వంలోని వైద్య బృందం సభ్యులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ సంకీర్తన, కృష్ణవేణి, ప్రసన్న, రాజేష్, భిక్షపతి పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీహెచ్ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, బాలవికాస సేవా సంస్థ మెయిన్ కోఆర్డినేటర్ ఎం. రమ, ఎం. సరిత తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్‌లో ఘనంగా తడిసిన ప్రదీప్ రెడ్డి జన్మదిన వేడుకలు



**కల్వకుర్తి అక్షిత ప్రతి నిధి:** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో చౌదర్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు చౌదర్ పల్లి గ్రామ అభివృద్ధి ప్రదాత తడిసిన ప్రదీప్ రెడ్డి జన్మదిన వేడుకలను వెల్జల్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శాలువతో సన్మానించి కేక్ కటింగ్ చేయించి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి మాజీ ఎంపిటిసి జి శ్రీనివాసమూర్తి,మాజీ ఉపసర్పంచ్ లు బి నర్సింలు అజీజ్, సీనియర్ నాయకులు పి అశోక్ బాబు మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్,చౌదర్పల్లి గ్రామం పంచాయతీ వార్డు సభ్యులు తడి సిన చంద్ర శేఖర్ రెడ్డి,నాయకులు వద్దే రాజు, పులిజాల విష్ణు,కే చంద్రయ్య, ఏ చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌లో పాల్గొన్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాల, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాల, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ. తన ఓటు వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నింపి సంబంధిత అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రతి ఒక్క ఓటరు విధిగా  ఎస్ ఐ ఆర్ పక్రియ లో భాగం కావాలని అన్నారు. చనిపోయిన వారి ఓట్ల తొలగింపుతో పాటు.. వేరువేరు ప్రాంతాల్లో డబుల్ ఓట్ల గుర్తించి,తొలగింపులో బీజేపీ కార్యకర్తలు భాగం కావాలని పిలుపు ఇచ్చారు. బీజేపీ కార్యకర్తలు హెల్ప్ డెస్క్ లను ప్రతి బూత్ లో ఏర్పాటు చేసి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో ఓటర్లకు సహాయపడాలని అన్నారు.

# సుడా రేసులో 'అసంపల్లి'

### తెలంగాణ, ఢిల్లీ నేతలతో లాబీయింగ్

### అనేక క్రీడా స్వచ్ఛంద సంస్థలతో సంబంధాలు

### కలసి రానున్న 'కులం' కార్డు



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పదవి కాలం ముగియడంతో ఆ పీఠాన్ని దక్కించుకునేందుకు పలువురు కాంగ్రెస్ నేతలు తమ వంతు ప్రయత్నాలు ఆరంభించారు. ఓవైపు పార్టీకి చేసిన సేవలను ఏకరువు పెడుతూనే, మరోవైపు టిపిసిసి, ఏ సి సి నేతలతో సంబంధాలు ఉన్న మంత్రుల ద్వారా లాబీయింగ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఈ పదవిని ఒక పర్యాయం నిర్వహించిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మరోసారి రెన్యువల్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.ఇది ఇలా ఉండగా సీనియర్ కాంగ్రెస్ నేత , ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు అనుచరుడు ఆసంపల్లి శ్రీనివాస్ సుడా చైర్మన్ పదవిపై కన్నేశారు.ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి కూడా తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు .అయితే ఇప్పటికే ఒకసారి సుడా చైర్మన్



గా పనిచేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి తిరిగి పదవి కట్టబెట్టద్దని, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా కొత్తవారికి అవకాశం కల్పించాలని పలురు కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆసంపల్లి శ్రీనివాస్ శ్రీధర్ బాబు అనుచరుడే కాకుండా, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు పొన్నం ప్రభాకర్ , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు సన్నిహితుడిగా కాంగ్రెస్ శ్రేణుల్లో సుపరిచితుడు. ఇదే కారణంగా కరీంనగర్ నివాసి అయిన ఆసంపల్లి శ్రీనివాస్ కు సుడా చైర్మన్ పదవి దక్కుతుందనే ధీమాను అతని అనుచరులు వ్యక్తం చేస్తున్నారు.అసంపల్లి శ్రీనివాస్ కు పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

శ్రీనివాస్ గత పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి కాంగ్రెస్ టికెట్ ఆశించినప్పటికీ వివిధ సామాజిక సమీకరణల కారణంగా టికెట్ దక్కలేదు .సీనియర్ వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా , సైక్లింగ్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా , తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌరవాధ్యక్షులుగా ఆసంపల్లి శ్రీనివాస్ కొనసాగుతున్నారు . గత పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం ఆయన తీవ్రంగా కృషి చేశారు . ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ ద్వారా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వస్తున్నారు. అసంపల్లి శ్రీనివాస్ కు సీఎం రేవంత్ రెడ్డి తోపాటు ఢిల్లీ పెద్దల ఆశీస్సులు ఉన్నట్లు సమాచారం. అందరి ఆశీస్సులతో తనకు శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పదవి దక్కుతుందని ధీమాతో అసంపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

# కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,

### గర్భిణీలను ఏఎన్‌సీ పరీక్షలకు తీసుకురావడంలో తప్పనిసరిగా 102 సేవలను వినియోగించాలి,

### ఆశా కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశం,



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, గర్భిణీలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించిన కలెక్టర్ వైద్యులు, సిబ్బందితో మాట్లాడి రోగులకు అందుతున్న చికిత్స, పరీక్షలు, మందుల లభ్యత, మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఆసుపత్రి తనిఖీ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ఏఎన్‌సీ (అంటెనాటల్ కేర్) పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ మహిళలను జిల్లా కలెక్టర్ పలకరించారు. వారి వద్దకు వెళ్లి ఆప్యాయంగా మాట్లాడిన ఆయన, ఏ గ్రామం నుంచి వచ్చారు, ఆసుపత్రికి ఎలా వచ్చారు, ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన గర్భిణీలు తాము బస్సులో ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు.

దీంతో అక్కడే ఉన్న ఆశా కార్యకర్తలను జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. ప్రభుత్వం గర్భిణీల కోసం ఉచితంగా అందుబాటులో ఉంచిన 102 అంబులెన్స్ సేవలు ఉన్నప్పటికీ వాటిని ఎందుకు వినియోగించలేదని ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఏఎన్‌సీ పరీక్షలు, ప్రసూతి సేవలు, ఇతర వైద్య అవసరాల కోసం గర్భిణీ మహిళలను ఆసుపత్రులకు తీసుకువచ్చే ప్రతి సందర్భంలో తప్పనిసరిగా 102 అంబులెన్స్ సేవలను వినియోగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

గర్భిణీలకు సురక్షితమైన, సమయానుకూలమైన ఉచిత రవాణా కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 102 సేవలను అందుబాటులో ఉంచిందని, వాటిని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా గర్భిణీలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో వైద్య సేవలు పొందగలరని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ఆశా కార్యకర్తలు మరింత బాధ్యతతో వ్యవహరించి ప్రతి గర్భిణికి ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహిస్తున్న విభాగాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఎంతమంది గర్భిణీలకు ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహిస్తున్నారు, నమోదు వివరాలు సక్రమంగా నిర్వహిస్తున్నారా, అవసరమైన పరీక్షలు అన్నీ జరుగుతున్నాయా అనే అంశాలపై రికార్డులను పరిశీలించారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, హైరిస్క్ గర్భిణీలను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు.

తదుపరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్యుల అందుబాటు, సిబ్బంది స్పందన, ఆసుపత్రిలో పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగే విధంగా సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ మహమ్మద్, కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం, డాక్టర్ శివరాం, కల్వకుర్తి డిప్యూటీ డీఎంహెచ్ఓతో పాటు వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# నాబార్డ్ 45వ ఆవిర్భావ దినోత్సవం

# ఘనంగా నిర్వహణ

**సమన్వయంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం: నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ పసుల విజయ్ కుమార్**



**జనగామ అక్షిత బ్యూరో :** రఘునాథపల్లి రైతు వేదికలో నాబార్డ్ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లాలో నాబార్డ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, రైతులు, గ్రామీణ యువతకు అవగాహన, మార్గదర్శక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమ, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ పసుల విజయ్ కుమార్‌తో పాటు జిల్లా అభివృద్ధి శాఖల అధికారులు, బ్యాంకింగ్ రంగ ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పసుల విజయ్ కుమార్ మాట్లాడుతూ, నాబార్డ్, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు సమన్వయంతో పనిచేస్తే గ్రామీణాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, రైతుల ఆదాయ వృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో నాబార్డ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.



గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి నాబార్డ్ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. జల సంరక్షణ కార్యక్రమాల ద్వారా చెక్‌డ్యామ్‌లు, వ్యవసాయ కుంటలు, కాంటూర్ ట్రెంచ్‌లు, చెరువుల పునరుద్ధరణ వంటి ప్రకృతి వనరుల సంరక్షణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. నీటి వనరులను ఆధారంగా చేసుకుని చేపల పెంపకం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం, ఇతర జీవనోపాధి కార్యక్రమాల ద్వారా గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, విలువ ఆధారిత వ్యవసాయం, పాడి పరిశ్రమ, చేపల పెంపకం వంటి రంగాలను సద్వినియోగం చేసుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక నిర్వహణ, పొదుపు, బ్యాంకు రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు, ఉపాధి యూనిట్ల స్థాపనపై అవగాహన కల్పించారు.

వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు సేవలు, పథకాల అమలు విధానాన్ని వివరించారు. గ్రామీణ ప్రజలు ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ సేవలు, అందుబాటులో ఉన్న అభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

'ఐకమత్యమే మహాబలం' అనే స్ఫూర్తితో సమన్వయంతో ముందుకు సాగితే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని, రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని పసుల విజయ్ కుమార్ పేర్కొన్నారు. నీటి సంరక్షణ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి లక్ష్యాలతో అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులను శాలువాలతో సత్కరించి, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారతకు వారు అందిస్తున్న సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డీపీఎం భవాని, పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్ రావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మూర్తి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు జనగామ అధికారులు సంతోషి, రఘునాథపల్లి బ్రాంచ్ మేనేజర్ సతీష్, జిల్లా సహకార అధికారి శ్రీరామ్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు నందకిశోర్, బ్యాంకు మేనేజర్లు, విజయ డెయిరీ డీడీ గోపాల్ సింగ్, మండల వ్యవసాయ అధికారి కరుణాకర్, మారి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మరపాక వెంకట్, యాదగిరి, నర్సింగం రాజు, శ్రీరామ్ శ్రీనివాస్, స్పందన సంస్థ ప్రతినిధి సోమయ్య, సిరి సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**పెద్దఅడిశర్లపల్లి మండలంలో డీఈఓ సుశీందర్ రావు ఆకస్మిక తనిఖీ**

**మోడల్ స్కూల్, హాస్టల్, కేజీబీవీ పరిశీలన - విద్యార్థులతో ముఖాముఖి**

**పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి: డీఈఓ ఆదేశం**



**పెద్దఅడిశర్లపల్లి, అక్షిత ప్రతినిధి :** నల్గొండ జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ సుశీందర్ రావు శుక్రవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ప్రభుత్వ విద్యా సంస్థలను ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతులపై సమగ్రంగా పరిశీలించారు.



మోడల్ స్కూల్ మరియు మోడల్ స్కూల్ హాస్టల్ను సందర్శించిన ఆయన విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, పరిశుభ్రత, మౌలిక వసతులను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణను మరింత మెరుగుపరుస్తూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల (కేజీబీవీ)ను సందర్శించి విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. వారి సమస్యలు, అవసరాలను తెలుసుకొని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు.తదుపరి పాఠశాలలోని వంటగది మరియు మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ పరిశుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని, ఆహార తయారీలో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని వంట సిబ్బందికి, సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈ పర్యటనతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, విద్యార్థుల సంక్షేమం, పరిశుభ్రత, పౌష్టికాహారం, మౌలిక వసతుల మెరుగుదలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి దన్నె రాజు , పి.ఏ.పల్లి గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ వెంకటయ్య , కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఉమాదేవి , గ్రామ కార్యదర్శి అక్షిత తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు పనులు పరిశీలన



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, పాలు అందించి ఆకలి తీర్చే హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసే సెంట్రలైజ్డ్ కిచెన్ పనులను శుక్రవారం కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులకు, మార్కెట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ షెడ్డు ఏర్పాటు పనులు చేసుకోవాలని ట్రస్ట్ డీజీఎం (ఆపరేషన్స్) రాముకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, మార్కెట్ చైర్మన్ ఆకుల నరసయ్య, మార్కెట్ సెక్రెటరీ సయ్యద్ హమీద్, అధికారులు తదితరులు ఉన్నారు.

## గిరిజన పట్టభద్రులకు బిఈడి కాలేజీలో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**ఐటీడీఏ పీవో బి.రాహుల్..**



**భద్రాచలం అక్షిత న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలోని ఏజన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థులు ఉన్నత విద్య అభ్యసించుట కొరకు భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన బీఈడీ కళాశాలలో (28 వ బ్యాచ్) రెగ్యులర్ బి.ఎడ్ కోర్సులకు 2026-2028 సంవత్సరం నకు గాను గిరిజన పట్టభద్రుల నుండి నేరుగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాలలో 100 సీట్లు ఉన్నాయని, తెలంగాణ ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతములకు చెందిన గిరిజన పట్టభద్రులై ఉండవలెనని, డిగ్రీ పాసై కనీసం 40శాతం మార్కులు, డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్ ని బట్టి ఎంపిక జరుగుతుందని, ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం మహిళలకు ప్రత్యేక కేటగిరి వారికి సీట్లు రిజర్వు చేయబడ్డాయని, ప్రభుత్వ ఉత్తర్వులు నెంబర్ 14.- 12-04-2021, నెంబర్ 53. 19-05-2009న ప్రకారం పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు..

ఈ కళాశాలలో ప్రవేశానికి ప్రాస్పెక్టస్, దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయని, ఏటూరు నాగారం, ఉట్నూర్, మన్ననూరు ఐటిడిఏ కార్యాలయంలలోను గిరిజన బిఈడి కళాశాల భద్రాచలం నందు దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చునని ఆయన ఆయన పేర్కొన్నారు..

దరఖాస్తు పోస్టు ద్వారా పొందగోరు అభ్యర్థులు తమ సొంత అడ్రస్ గల కవర్ (రు.10/-స్టాంపుతో)ను ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలంకు పంపి పొందవచ్చునని, దరఖాస్తు, ప్రాస్పెక్టస్ వివరాలను పూర్తిగా చదువుకొని, వచ్చేనెల ఆగస్టు 16న, సమర్పించాలని, దరఖాస్తులు తప్పులు లేకుండా పూర్తి శశి సమర్పించిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించబడతాయని ఆయన చెప్పారు..

పూర్తి వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు... 8247528404, 82477 98370, 99122 72959.

# నేడు తాండూరుకు మంత్రుల రాక

**రూ.290 కోట్ల విలువైన హ్యామ్ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**భూ నిర్వాసితులకు రూ.25 కోట్ల పరిహార చెక్కుల పంపిణీ**



**తాండూరు, అక్షిత ప్రతినిధి:** ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవతో తాండూర్ అభి వృద్ధిలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. (18-07-2026) శనివారం నాడు ఉదయం 10:00 గంటలకు అంతారం గ్రామ పరిధిలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేతుల మీదుగా రూ.290 కోట్ల విలువైన హ్యామ్ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కందనెల్లి పరిధిలోని జిపిఆర్ గార్డెన్స్‌లో బైపాస్ భూ నిర్వాసితులకు రూ.25 కోట్ల పరిహార చెక్కుల పంపిణీ కార్యక్రమం మరియు "ప్రగతి సభ" నిర్వహించ బడుతుంది.

# వాంగ్‌చుక్‌కు సంపూర్ణ మద్దతు

**ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి**

**బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** నీట్ ప్రశ్నాపత్రం లీక్, సీబీఎస్ఈ అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకలు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న లోపాలపై నిరసనగా నిరాహార దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్‌కు వనపర్తి జిల్లా కొత్తకోట చౌరస్తాలో బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, సీజేపీ కార్యకర్తలతో పాటు వందలాది మంది విద్యార్థులు, యువత జంతర్‌మంతర్‌లోని క్రాంతి కార్నర్ వద్ద సామూహిక నిరాహార దీక్ష చేపట్టడం అభినందనీయమని అన్నారు. దేశ యువత వ్యక్తం చేస్తున్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత, సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం, విద్యా వ్యవస్థలో మార్పుల కోసం సోనమ్ వాంగ్‌చుక్ చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించి, విద్యా రంగంలో విశ్వసనీయమైన సంస్కరణలు చేపట్టే నాయకత్వాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, యువజన ప్రతినిధులు పాల్గొని సోనమ్ వాంగ్‌చుక్ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి బొబ్బిలి నెక్సన్, బాలకొండన్న యాదవ్, మాజీ వార్డు సభ్యులు అభిమన్యుడు, భాస్కర్ యాదవ్, గమనియాల్, ముజీబ్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీని రాజకీయ వేదికగా మార్చొద్దు..

**యూనివర్సిటీ భూముల విషయంలో ద్వంద్వ వైఖరి ఎందుకు?**

**మామునూరు విమానాశ్రయంపై బీఆర్‌ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** కాకతీయ యూనివర్సిటీని రాజకీయాలకు అడ్డాగా మార్చకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రెచ్చగొట్టి యూనివర్సిటీ అభి వృద్ధిని అడ్డుకునే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలో పర్యటించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియా తో



మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలపై గతంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు కలిసి పలుమార్లు సమీక్షలు నిర్వహించి, సమగ్ర డీపీఆర్ రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వరంగల్ పర్యటన సందర్భంగా కూడా యూనివర్సిటీ సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించి, అభివృద్ధి కోసం నిధులు, ప్రణాళికలపై చర్చించినట్లు వెల్లడించారు.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత కూడా అభివృద్ధి పనులను ఎందుకు అడ్డుకున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. యూనివర్సిటీలో మెస్ అక్రమాలపై కమిటీ వేసినా ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. మెస్, క్యాంటీన్లలో తరచూ వివాదాలు జరుగుతున్నా స్పందించని వారు అభివృద్ధి పనుల విషయంలో మాత్రమే ఉద్యమాలు చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని అన్నారు.

పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మామునూరు విమానాశ్రయానికి అవసరమైన కేంద్ర అనుమతులు, సాంకేతిక క్లియరెన్స్‌లు, కార్యాచరణ ఏదీ పూర్తి చేయలేదని అన్నారు. రూ.350 కోట్లకు పైగా జీఎంఆర్‌కు చెల్లింపులు చేసినా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేకపోయారని గుర్తుచేశారు

# స్మార్ట్ కిడ్జ్‌లో మొక్కలు నాటిన చిట్టి చేతులు

**నేడు చెట్టు నాటుదాం**

**రేపటి కోసం పచ్చని భవిష్యత్తుని నిర్మిద్దాం..!!**

**అంటూ నినదించిన స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు**

**ఆనంద ఉత్సవాలతో వన మహోత్సవ సంబురం**

**ఆకట్టుకున్న చిన్నారుల వనమహోత్సవ చైతన్య ర్యాలీ**

**హాజరైన కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారి రాధిక**







**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరం స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆవరణం శుక్రవారం చిట్టి చేతుల వన మహోత్సవ సంబరంలో మురిసిపోయింది. చిన్నారులు వనమహోత్సవ వేడుకను ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల చిన్నారులు పాఠశాల మైదానంలో రహదారులకు ఇరువైపులా పలు రకాల మొక్కలను నాటారు. నీడనిచ్చే మొక్కలు పండ్ల మొక్కలు అందంగా పూలతో ఉండే మొక్కలు తదితర వివిధ రకాల మొక్కలను నగరంలోని వేరువేరు ప్రాంతాలలో నాటారు. మొక్కలతో నగరంలో పాఠశాల విద్యార్థులు వనమహోత్సవ చైతన్య ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన విద్యార్థులు ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల గుండా నిర్వహించి ప్రజలను వనమహోత్సవం గురించి చైతన్యపరిచారు. పాఠశాలలో మొక్కల ప్రయోజనాలను వివరిస్తూ ఇద్దరు విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటిక అందరిని ఆలోచింపజేసింది. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య వనమహోత్సవ ర్యాలీని ప్రారంభించగా ఖమ్మం కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారిని రాధిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారిని రాధిక మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సంకల్పంతో నిర్వహించాలని కోరారు. మొక్కలు పెంచడం ద్వారా మనకు దీర్ఘకాలంగా ప్రాణవాయువు లభిస్తుందని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్నామని ఈ ప్రాంతంలోని పెరిగిన చెట్లు తమ పాఠశాల విద్యార్థులు గతంలో నాటిన మొక్కల వల్లనే ప్రయోజనం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి విజ్ఞాన్ మంథన్-2026-27కు దరఖాస్తులు ప్రారంభం

**ప్రతిభావంతులకు ఇంటర్న్‌షిప్‌లు, భాస్కర స్కాలర్‌షిప్ అవకాశం**



**సంగారెడ్డి అక్షిత బ్యూరో:** సంగారెడ్డి: దేశంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే విద్యార్థి విజ్ఞాన్ మంథన్ --2026-27 సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి శంకర్ తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడం, భారతీయ శాస్త్రవేత్తల కృషిని పరిచయం చేయడం, ప్రతిభావంతులను గుర్తించి ఉన్నత శాస్త్రీయ పరిశోధనల వైపు ప్రోత్సహించడం ఈ పరీక్ష ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇస్రో, డీఆర్‌డీఓ, సీఎస్ఐఆర్, బార్క్, ఐఐఎస్ఈఆర్, ఐఐసీటీ, ఎన్ఐఎన్ వంటి జాతీయ పరిశోధనా సంస్థల్లో ప్రత్యేక ఇంటర్న్‌షిప్ శిక్షణతో పాటు జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి భాస్కర స్కాలర్‌షిప్ కింద ఏడాది పాటు నెలకు రూ.2,000 ఉపకార వేతనం అందజేయనున్నట్లు తెలిపారు. పరీక్షను జూనియర్ (6,7,8 తరగతులు), సీనియర్ (9,10,11 తరగతులు) విభాగాలుగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ సహా 14 భారతీయ భాషల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమైన నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుందని, సెప్టెంబర్ తొలి వారంలో మాక్ టెస్టులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 16 నుంచి 21 వరకు తరగతుల వారీగా లెవెల్--1 పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతులు, మెమెంటోలు, పరిశోధనా సంస్థల సందర్శన, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేయబడుతుందని, నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని చెప్పారు. అన్ని పాఠశాలలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో పాల్గొనేలా ప్రోత్సహించాలని శంకర్ విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి (6302290235), వీవీఎం జిల్లా కోఆర్డినేటర్ కీర్తి చంద్రిక మఠం (9618221819)లను సంప్రదించాలని సూచించారు.